మురుగు కదలదు..దుర్గంధం వీడదు

- పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

సంగం: మండలంలోని పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. కూటమి ప్రభుత్వం సీసీరోడ్ల నిర్మాణం మీద పెట్టిన మక్కువ డ్రైనేజీల నిర్మాణం, పూడిక తీతపై చూపకపోవడంతో మురుగు ఇళ్ల మధ్యన నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోంది. పంచాయతీల్లో నిధులు ఉన్నప్పటికీ కొన్నిచోట్ల ప్రభుత్వాధికారులు ఖర్చు చేసేందుకు ప్రజాప్రతినిధులకు సహకారం అందించడం లేదు. ఈ కారణంగా అనారోగ్యం బారిన పడి ఆస్పత్రులకు వేలాది రూపాయలను ఖర్చు చేయాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో దాదాపు అన్ని గ్రామాల్లో సీసీరోడ్లకు ఇరువైపులా డ్రైనేజీల నిర్మాణం చేపట్టలేదు. దీంతో అంతర్గతరోడ్లపై మురుగు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారుల వెంట డ్రైనేజీలు ఉన్నా పూడిపోయి మురుగు ముందుకు కదలడం లేదు. వర్షం పడితే డ్రైనేజీలు పొంగి మురుగు ఇళ్లలోకి వస్తుండడంతో ఆయా ప్రాంతాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజాప్రతినిధులు కావడంతోనే..

మండలంలోని పంచాయతీలకు సర్పంచ్‌లుగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఉన్నారు. దీంతో కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులు పంచాయతీల్లో అభివృద్ధి పనుల వైపు దృష్టి సారించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కనీసం కొన్ని పంచాయతీల్లో అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలు సైతం సిద్ధం చేసేందుకు కూడా విముఖత ప్రదర్శిస్తున్నట్లుగా తెలుస్తోంది. అన్నారెడ్డిపాళెంలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీలు లేక ఇబ్బందులు పడుతున్నామని పలుమార్లు ప్రజలు అధికారులకు విన్నవించారు. అయితే అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపించాల్సిన పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో నిధులు మంజూరు కావడలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై గ్రామస్తులు మండల ప్రత్యేకాధికారి, పశుసంవర్ధకశాఖ జేడీ రమేష్‌నాయక్‌కు గత మంగళవారం ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఆయన మరోమారు ఇలాంటి ఘటనలు పునరావృతమైతే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని పంచాయతీకార్యదర్శిని హెచ్చరించారు. కోలగట్ల గ్రామంలో సైతం ఇదే విధంగా డ్రైనేజీ సమస్యతో ప్రజలు నిత్యం నరకం చూస్తున్నారు. జెండాదిబ్బ పంచాయతీలో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని గ్రామస్తులు కలెక్టరేట్‌లో జరిగే ప్రజాసమస్యల పరిష్కారవేదికలో సైతం వినతిపత్రాలు అందజేశారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పారిశుధ్యం సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


కోలగట్లలో సీసీరోడ్డు పక్కన డ్రైనేజీ లేక నిల్వ ఉన్న మురుగు


అన్నారెడ్డిపాళెంలో సీసీరోడ్డుపై చేరిన మురుగు

ఇబ్బందులు పడుతున్నాం



గ్రామంలో ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన డ్రైనేజీలు దెబ్బతినడంతో పూడికతో నిండి ఉన్నాయి. దీంతో మురుగు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు స్పందించి డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి.

– పద్మ, అన్నారెడ్డిపాళెం

అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాం



గ్రామంలో డ్రైనేజీలు సరిగా లేని కారణంగా అవస్థ పడుతున్నాం. ఇటీవల మా చిన్నారి అనారోగ్యం బారిన పడింది. ఆస్పత్రికి వెళ్లి బాగు చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి మురుగు పారేలా డ్రైనేజీల నిర్మాణం చేపట్టి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా చూడాలి

–అనూష, అన్నారెడ్డిపాళెం

పారిశుధ్య సమస్య పరిష్కారానికి చర్యలు

మండలంలోని అన్నీ పంచాయతీల్లో పారిశుధ్య సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేస్తాం.

–షాలెట్, ఎంపీడీఓ, సంగం

క్లుప్తంగా

ఆర్టీసీ ఆస్తులను ప్రైవేట్ సంస్థలకు ఇవ్వడం తగదు



ఉదయగిరి: విజయవాడలోని ఆర్టీసీకి చెందిన పాతబస్టాండ్ స్థలాన్ని లులు అనే ప్రైవేట్ సంస్థకు అప్పగించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ఎస్‌ఎంయూ ఉద్యోగులు శనివారం ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీకి చెందిన విలువైన ఆస్తులను ప్రైవేట్ సంస్థలకు ధారాదత్తం చేయడం తగదన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రెండు రోజుల పాటు నిరసన కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. నాయకులు శంకర్, నాగరాజు, కాశీవిశ్వనాథ్, మునీర్, సురేష్, వెలుకొండయ్య, సిద్ధయ్య, ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలకు టీవీ బహూకరణ



కలిగిరి: స్థానిక ఆదర్శ పాఠశాలకు ఇంగ్లిష్ టీచర్ సీహెచ్ కళావాణి శనివారం టీవీని బహూకరించారు. ప్రిన్సిపల్ అన్నవరపు శ్రీను మాట్లాడుతూ వసతిగృహ విద్యార్థినుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని టీవీని బహూకరించిన ఉపాధ్యాయిని కళావాణిని అభినందించారు. అనంతరం కళావాణిని ఉపాధ్యాయులు, విద్యార్థులు సత్కరించారు.

ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలి



ఉదయగిరి రూరల్: ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని ఎంఈఓ–1 షేక్ మస్తాన్‌వలీ అన్నారు. ఉదయగిరిలోని ఎస్‌బీ పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యాసన, పఠనా సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. విద్యార్థులను తమ సొంత బిడ్డలుగా భావించి బాధ్యతతో ప్రేమానురాగాలతో విద్యాబోధన చేయాలన్నారు. సకాలంలో సిలబస్‌ను పూర్తి చేస్తూ వర్క్ బుక్స్, నోట్ బుక్స్, హోమ్‌వర్క్ బుక్స్‌ను ఎప్పటికప్పుడు దిద్దాలన్నారు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను ప్రతి విద్యార్థికి అందజేయాలన్నారు.

ఉర్దూ పాఠశాల తనిఖీ



సంగం: జెండాదిబ్బలోని మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను జిల్లా ఉర్దూ పాఠశాలల ఉపతనిఖీ అధికారి షేక్ ఖాజామొహిద్దీన్ శనివారం తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఎస్‌ఏ–1 పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేయాలని సూచించారు.

మినరల్ వాటర్‌ప్లాంట్ ప్రారంభం

జలదంకి: : మండలంలోని బీకేఅగ్రహారంలో కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్‌ప్లాంట్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ జలదంకి మండలాభివృద్ధికి తన శాయాశక్తుల కృషి చేస్తానన్నారు. బ్రాహ్మక్రాక పంచాయతీకి చెందిన నాయకులు దగుమాటి మాల్యాద్రిరెడ్డి, వంటేరు నందగోపాల్‌రెడ్డి, మేకల శ్రీనాథ్‌రెడ్డి, జిలుమూడి వినయ్‌కుమార్‌రెడ్డి, కాకర్ల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారి ఉచిత దీవెన యాత్ర రేపు

నెల్లూరు(బృందావనం): తిరుమల శ్రీవారి ఉచిత దీవెనయాత్రను సోమవారం నిర్వహించనున్నామని సత్యమార్గ్ ఫౌండేషన్ కన్వీనర్లు పూడి రవిస్వామి, మస్తానమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పురమందిరం వద్ద గల జ్యోతి వినాయకస్వామి ఆలయం నుంచి యాత్ర ప్రారంభంకానుందని, పాల్గొనాలనుకునే వారు 93466 99526 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం



మర్రిపాడు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గంగవరపు లక్ష్మీదేవి అధ్యక్షతన శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. తొలుత ఎంపీడీఓ నాగేశ్వరప్రసాద్ అజెండాలోని అంశాలను చదివి వినిపించారు. అనంతరం మండలాధికారులు శాఖలవారీగా ప్రగతిని చదివి వినిపించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ పంచాయతీల్లోని సమస్యలను పలుమార్లు సభ దృష్టికి తీసుకొచ్చినా పరిష్కరించడం లేదని, అలాంటప్పుడు ఎందుకు సమావేశాలు నిర్వహిస్తున్నారని అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. మొక్కుబడిగా సమావేశాలు నిర్వహించడం ఎందుకని మండిపడ్డారు. ఈ సమావేశంలో తహసీల్దార్ అనిల్‌కుమార్, మండలాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దూరవిద్యకు అవకాశం

ఆత్మకూరు: పట్టణంలోని షిర్డీ సాయిరామ్ డిగ్రీ, పీజీ కళాశాలలో దూర విద్యకు అవకాశాన్ని కల్పిస్తున్నామని కరస్పాండెంట్ రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి శ్రీవెంకటేశ్వర, యోగివేమన, నాగార్జున వర్సిటీల ద్వారా బీఏ, బీకాం, ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంబీఏ, తదితర కోర్సులను దూరవిద్య ద్వారా అభ్యసించుటకు అవకాశాన్ని కల్పిస్తున్నామని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు ఆగస్టు 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పక్కాగృహాలను త్వరగా పూర్తిచేయాలి

అనుమసముద్రంపేట: ప్రభుత్వ గృహ లబ్ధిదారులు నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ ప్రసన్నకుమారి సూచించారు. ఏఎస్‌పేట గిరిజనకాలనీలో గృహ నిర్మాణశాఖ ఏఈ వివేక్‌తో కలిసి శనివారం ఆమె పర్యటించారు. గృహ లబ్ధిదారులకు నిర్మాణాలను పూర్తి చేసుకోవడంపై అవగాహన కల్పించారు. ఎన్నో ఏళ్లుగా గిరిజనులకు గృహాలు లేకపోవడంతో ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. లబ్ధిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అధికారులు చెప్పిన నియమనిబంధనలు పాటిస్తూ పూర్తి చేసుకోవాలని సూచించారు. ఆమె వెంట గృహ నిర్మాణశాఖ అధికారులు ఉన్నారు.


గృహ లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

బాధిత మహిళకు ఆర్థిక సాయం

-మానవత్వం చాటుకున్న యువకులు

ఆత్మకూరు: భర్త చేతిలో దాడికి గురై ప్రాణాపాయ స్థితిలో నెల్లూరులోని నారాయణ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు ఆత్మకూరుకు చెందని పలువురు యువకులు రూ.50వేలు ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు. దగదర్తి మండలం తడకలూరులో నివాసం ఉంటున్న మున్వర్ తన భార్య సుల్తానాపై అనుమానం పెంచుకుని తరచూ వేధించేవాడు. ఈ నేపథ్యంలో గత వారం సుల్తానా కళ్లల్లో కారం కొట్టి కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. అతికష్టం మీద తప్పించుకున్న ఆమె బంధువుల ఇంటికి చేరింది. వారి సాయంతో నెల్లూరులోని నారాయణ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. బాధితురాలికి వరసకు సోదరుడైన ఆత్మకూరుకు చెందిన యువకుడు ఆమె పరిస్థితిని మిత్రులకు తెలియజేయగా పలువురు యువకులు స్పందించారు. రూ.50వేలు నగదును సేకరించి బాధిత మహిళకు నెల్లూరులోని నారాయణ ఆస్పత్రి వద్ద శనివారం అందజేశారు.


బాధితురాలికి ఆర్థిక సాయం అందజేసిన యువకులు

ఘనంగా కార్గిల్ విజయ్‌దివస్


ఆత్మకూరు: నాగేశ్వరరావును సత్కరిస్తున్న కలెక్టర్

సోమశిల: అనంతసాగరం మండలం ఉప్పలపాడు లిటిల్ ఏంజిల్స్ పాఠశాల ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్‌దివస్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్గిల్ యుద్ధంలో భారత సైనికులు విజయం సాధించి 26 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అనంతసాగరంలో 100 మీటర్ల పొడవు గల భారీ జాతీయ జెండాతో విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు సైనిక దుస్తుల్లో విన్యాసాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. అలాగే చిలకలమర్రి జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడు ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్‌దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ జెండాను ప్రదర్శిస్తూ అమరవీరులకు నివాళులర్పించారు. ఎంఈఓ–2 ప్రభాకర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ రెడ్డి, మల్లికార్జున, అనంతసాగరం పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు చల్లా చంద్రోశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ఉదయగిరిరూరల్: సుభానిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

మాజీ సైనికులకు సన్మానం

ఉదయగిరి రూరల్‌: కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని పట్టణంలోని అగ్రహారంవీధికి చెందిన మాజీ సైనికుడు షేక్ సుభానిని ఆయన నివాసంలో బీజేపీ నాయకులు శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కార్గిల్ యుద్ధం ఎందరో సైనికుల త్యాగాల ఫలితంగా విజయవంతమైందన్నారు. యుద్ధంలో అశువులు బాసిన సైనికులకు నివాళులర్పించి వారి సేవలను స్మరించుకోవాల్సిన బాధ్యత దేశపౌరులపై ఉందన్నారు. సాగర్ సేవా సమితి అధ్యక్షుడు మన్సూర్‌అలీ, బీజేపీ నాయకులు రోశయ్య, సుబ్బరత్నం, దుగ్గయ్య, మస్తాన్ పాల్గొన్నారు.

ఆత్మకూరు: కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని ఆత్మకూరుకు చెందిన పలువురు మాజీ సైనికులను ఘనంగా సన్మానించారు. నెల్లూరులో కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆత్మకూరుకు చెందిన మాజీ సైనికులు కే నాగేశ్వరరావు, డీ బుజ్జయ్య, టీఏస్‌ఎస్‌వీ ప్రసాద్‌రెడ్డి, ఏడీ లక్ష్మి, టీ మహేశ్వరి, జానీబాషా, తదితరులను సత్కరించారు.


అనంతసాగరంలో సైనిక విన్యాసాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కిలో పొగాకు సగటు ధర రూ.195

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం కిలో పొగాకుకు సగటు ధర రూ.195 లభించింది. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 479 బేళ్లను తీసుకురాగా, 220 బేళ్లను కొనుగోలు చేసినట్లుగా వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు. కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.160, సగటున రూ.195.85 ధర లభించిందని వివరించారు.

డీసీపల్లిలో 419 బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శనివారం 419 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 777 బేళ్లు రాగా, 419 బేళ్లను విక్రయించామని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.159, సగటున రూ.202.21 ధర లభించిందని వివరించారు.

మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలి



ఆత్మకూరు: పొదుపు మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలని మెప్మా కమిటీ ఆర్గనైజర్ సీఓ మాధవి అన్నారు. పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ ఆవరణలో మెప్మా బజార్‌ను శనివారం నిర్వహించారు. రెండ్రోజుల పాటు నిర్వహించే మెప్మా బజార్‌లో పొదుపు మహిళలకు సొంతంగా తయారు చేసిన వివిధ రకాల ఊరగాయలు, వంటకాలు, పొడులు, బ్యాగులు, బుట్టలు, చేనేత వస్త్రాలు, గృహోపకరణాలు, తదితరాలను ప్రదర్శించారు. పలువురు ఆసక్తిగా తిలకించి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా సీఓ మాధవి మాట్లాడుతూ మెప్మా ఆధ్వర్యంలో పొదుపు సంఘాలకు, విడిగా మహిళలకు కుటీర పరిశ్రమలు, చిరువ్యాపారాల నిర్వహణకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయిస్తున్నామన్నారు. అలాంటి వారి కోసం ఉత్పత్తులను విక్రయించుకునేందుకు మెప్మా బజార్‌ను రెండు నెలలకోసారి రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నామని తెలిపారు. మెప్మా బజార్‌కు అధికారులు శాశ్వత భవన వసతి కల్పిస్తే నిత్యం వ్యాపారాలు నిర్వహించుకునేందుకు పొదుపు మహిళలకు అవకాశం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, చంద్రారెడ్డి, కౌన్సిలర్లు సూరా భాస్కర్‌రెడ్డి, మహబూబ్‌బాషా, పీ పెంచలయ్య, నాగేశ్వరరావు, మెప్మా సీసీలు వెంకటరమణమ్మ, సుష్మ పాల్గొన్నారు.

బదిలీ అయిన టీచర్లకు వెంటనే జీతాలివ్వాలి



నెల్లూరు (టౌన్): బదిలీ అయిన ఉపాధ్యాయులకు జీతాలను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు దర్గామిట్టలోని డీఈఓ కార్యాలయ ఎదుట నిరసనను యూటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం చేపట్టారు. డీఈఓ బాలాజీరావుకు వినతిపత్రాన్ని అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్ పనులతో ఉపాధ్యాయులు మానసిక ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి చలపతి శర్మ మాట్లాడారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శేషు, గౌరవాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, అసోసియేషన్ అధ్యక్షులు అచ్చయ్య, సుభాషిణి, కార్యదర్శులు సురేంద్రబాబు, నాగిరెడ్డి పాల్గొన్నారు.

సివిల్ సప్లయిస్ గోదాము తనిఖీ

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని సివిల్ సప్లయిస్ గోదామును జిల్లా అధికారులు శనివారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టార్‌లను తనిఖీ చేసి బియ్యం నిల్వలను పరిశీలించారు. తమకు కేటాయించిన బియ్యం సక్రంగా రావడం లేదని పలువురు డీలర్లు అధికారుల దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా వింజమూరు మండలం నల్లగొండ్ల రేషన్ షాపుకు 120 బస్తాలు రావాల్సి ఉండగా,కేవలం 55 బస్తాలు మాత్రమే రావడంతో పంపిణీ చేయడం ఇబ్బందిగా మారిందని డీలర్ విన్నవించారు. దీంతో అధికారులు రికార్డులను తనిఖీ చేసి సరిచేస్తామని తెలిపారు. అనంతరం వింజమూరులోని రేషన్‌షాపు నంబరు 5ను తనిఖీ చేశారు. అనంతరం వృద్ధులకు బియ్యం డోర్‌డెలివరీ ప్రక్రియను పరిశీలించారు. డీఎస్‌ఓ విజయకుమార్, సివిల్ సప్లయిస్ డీఎం అర్జున్, నెల్లూరు, కావలి ఏఎస్‌ఓలు అంకయ్య, రవి, సివిల్ సప్లయిస్ డీటీ శ్రీనివాసులు, మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు అల్లాబక్షు పాల్గొన్నారు.


వృద్ధులకు ఇంటి వద్ద బియ్యం పంపిణీ చేస్తున్న అధికారులు

మైనింగ్‌ను ఆపకపోతే ఉద్యమం చేపడతాం

వరికుంటపాడు: మండల కేంద్రమైన వరికుంటపాడు– జంగంరెడ్డిపల్లి మధ్య ఉన్న కొండపై కార్డ్జిజ్ నిక్షేపాల వెలికితీతకు సంబంధించిన మైనింగ్ పనులను ఆపకపోతే ఉద్యమం చేపడతామని ఎమ్మార్పీఎస్ నాయకులు హెచ్చరించారు. కార్ట్స్ మైనింగ్ పనులకు అనుమతులు ఇవ్వవదని కోరుతూ వరికుంటపాడు తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులకు శనివారం వారు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ గతంలో వాహనాల ద్వారా మైనింగ్ పనులు చేపట్టాలని చూడగా గ్రామస్తులు అడ్డుకుని పనులు నిలిపివేశారన్నారు. ఇటీవల వరికుంటపాడులో భాస్కరపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 223–1లోని 16.720 హెక్టార్లలో క్వార్ట్స్ తవ్వకాలకు సంబంధించి పర్యావరణ అనుమతుల కోసం ఏకపక్షంగా గ్రామసభ నిర్వహించారన్నారు. జంగంరెడ్డిపల్లి గ్రామస్తులు మైనింగ్ పనులను వ్యతిరేకిస్తున్నందున ఎమ్మార్పీఎస్ అండగా నిలిస్తుందన్నారు. అనంతరం మైనింగ్ పనులు చేపట్టాలనుకుంటున్న భూములను గ్రామస్తులతో కలిసి ఎమ్మార్పీఎస్ నాయకులు పరిశీలించారు.


రెవెన్యూ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బడిబయటి పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

సంగం: బడిబయట ఉన్న గిరిజన పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఐటీడీఏ ఏఎంఓ శాంతి కోరారు. మండలంలోని తరుణవాయి ఎస్టీ కాలనీలో శనివారం ఆమె పర్యటించారు. ఇంటింటికి తిరిగి పిల్లలను బడిలో చేర్పాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం తరుణవాయి జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి నాడు–నేడు ఫేజ్–2 పనులను పరిశీలించారు. విద్యా బోధన తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని గిరిజన కాలనీల్లో బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేకంగా ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో 15వేల మంది బడిఈడు పిల్లలకు గానూ ఇటీవల 5వేల మందిని పాఠశాలల్లో చేర్పించామని వివరించారు. జిల్లాలో రెండు వేల మంది గిరిజన పిల్లలు బడి బయట ఉన్నట్లు గుర్తించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి బడిలో చేరేంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆమె వెంట హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు ఉన్నారు.


ఎస్టీ కాలనీలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్న అధికారులు

స్మార్ట్ మీటర్లతో ప్రజలపై అధిక భారం

మర్రిపాడు: స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో ప్రజలపై అధిక భారం పడుతోందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మూలి వెంగయ్య, జిల్లా కార్యదర్శి మూలం సురేష్ తెలిపారు. మర్రిపాడులో శనివారం వారు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోగా టీడీపీ ఎంతో రాద్ధాంతం చేసిందని, తాము అధికారంలోకి వస్తే వాటిని ఏర్పాటు చేయబోమని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చాక టీడీపీ వాటి ఏర్పాటును ప్రోత్సహిస్తోందన్నారు. ఇప్పటికే పలు పంచాయతీలు, ప్రభుత్వ భవనాలకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీని వల్ల ప్రజలపై భారం పడుతోందన్నారు. ఇప్పటికే సర్‌చార్జీల పేరుతో ప్రజలపై విపరీతమైన భారం మోపడంతో విద్యుత్ బిల్లులు చెల్లించలేకపోతున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించిన ప్రస్తుత పాలకులు ఇప్పుడు మాత్రం వాటిని ఎలా కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. ఆదాని మీటర్లలో పగటి సమయంలో ఒకలా, రాత్రి సమయంలో మరోలా విద్యుత్ రీడింగ్ జరుగుతుందని, దీని వల్లే అధిక బిల్లులు వస్తున్నాయని ఆరోపించారు. వీటని ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో పంటలకు గిట్టుబాటు ధరలు లభించక రైతులు అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పొగాకు మొదలు ఏ రైతు కూడా ఆనందంగా లేరని, మిరప, మామిడి, పత్తి రైతులు గిట్టుబాటు ధరలు లేక అల్లాడుతున్నారన్నారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అదే విధంగా మెట్ట ప్రాంతానికి సాగు, తాగునీరు అందించేందుకు చేపడుతున్న హైలెవల్ కెనాల్ నిర్మాణ పనుల్లో పురోగతి లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు